క్లుప్తంగా

బద్వేలు అర్బన్ సీఐగా యుగంధర్



బద్వేలు అర్బన్ :బద్వేలు అర్బన్ సీఐగా పి.యుగంధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని పలు స్టేషన్లలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2018లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేశారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి సీఐగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు అర్బన్ సీఐగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జి.వెంకటేశ్వర్లు బద్వేలు రూరల్‌కు బదిలీ అయ్యారు.

సేవలకు సముచిత సత్కారం



సన్మాన గ్రహీతలు రామకృష్ణారెడ్డి, గురుమూర్తి

పోరుమామిళ్ల:సమాజంలోని అభాగ్యులను, వృద్ధులను చేరదీసి వారికి ఆశ్రమంలో వసతి కల్పించి ఆదరిస్తున్న మానవతామూర్తి పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, తెలుగుభాషలో విశేష కృషి చేస్తున్న తెలుగుపండిట్ కుందారపు గురుమూర్తికి సోమవారం సత్కారం చేశారు. . రామకృష్ణారెడ్డి వివేకానంద సేవాశ్రమం నిర్వహిస్తుండగా, మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుమూర్తి తెలుగు పండితులుగా పని చేస్తున్నారు.

తెలుగు వారోత్సవాల సందర్భంగా కవయిత్రి మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్వాన్ హనుమంతారావు, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి సేవాతత్పరులకు శాలువా, పూలదండ, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, వెయ్యి రూపాయల నగదు ఇచ్చి 'సేవా ధురీణ' బిరుదుతో సన్మానించారు.

చంద్రయాన్-3 విజయంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : చంద్రయాన్-3 విజయంపై విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ఈ విషయంపై భారత దేశాన్ని ప్రపంచ దేశాలు ప్రశంసలతో కొనియాడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి నాయకులు చీతిరాల నాగార్జున రావు, డాక్టర్ లక్ష్మీనరసయ్య, కాల్వ చలపతి, గోపీకృష్ణ స్కూల్ ప్రదీప్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

పోరుమామిళ్ల : సీపీఐ బస్సు యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పోరుమామిళ్లలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ మండల నాయకులు మస్తాన్, రవి మాట్లాడుతూ ఈ నెల 30న సీపీఐ బస్సు యాత్ర బద్వేలుకు చేరుతుందని, నాలుగురోడ్ల కూడలిలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు బహిరంగసభ జయప్రదం చేయాలని కోరారు. మోదీ నియంతృత్వ పాలన వ్యతిరేకిస్తూ వచ్చే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇలాంటి ప్రభుత్వాలను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ర్యాలీలో కేశవ, చెన్నయ్య, ప్రసాద్, చాంద్‌బాషా, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

అమృతానగర్ సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రొద్దుటూరు :స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అమృతానగర్ సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008, 2018లలో 2వేల మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. వెయ్యి మంది సొంత డబ్బు లక్షల రూపాయలు ఖర్చు చేసి బేస్‌మట్టాలు నిర్మించుకున్నారన్నారు. ఆ ప్రాంతంలో రోడ్లు, కరెంటు, నీళ్ల లేకపోవడంతో ఇళ్ల నిర్మించుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, చెన్నారెడ్డి, శివాచారి, బాబు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, రాములమ్మ, భానుమతి పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌ను బృందావనంలా చేస్తా

- రూ.3.40 కోట్లు సొంత నిధులతో రోడ్లు, కాలువల నిర్మాణం
- నేడు పాలకులు ఆస్తులు అమ్మి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు
- 50 ఏళ్ల సమస్య పరిష్కారానికి పూనుకున్నా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు:కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రకాష్ నగర్‌ను మూడు నెలల్లో బృందావనంలా తయారు చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రకాష్ నగర్ ప్రజలతో సోమవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోని కారణంగా 50 ఏళ్లుగా ప్రకాష్‌నగర్ కాలనీ అధ్వానంగా ఉందన్నారు. డ్రైనేజీ కాలువలు, రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు ప్రజలు సమస్యలపై తనకు ఫిర్యాదు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం ఆలస్యమవుతుందన్న కారణంతో తాను రూ.3.40 కోట్లు సొంత డబ్బు ఖర్చు చేసి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని నిర్ణయించానన్నారు. ఇప్పటికే ఈ విషయంపై అధికారులతో ప్రత్యేకంగా సర్వే చేయించి అంచనాలు వేయించానని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు పెట్టి ఓట్లు కొనే సంప్రదాయం కొనసాగుతోందని, ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆస్తులు అమ్మి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే తమ లాంటి నాయకులు కూడా నేడు ఉన్నారని తెలిపారు. కేవలం విమర్శలు కాకుండా టీడీపీ నేతలకు మనసు ఉంటే తమ ఆస్తులు అమ్మి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇచ్చిన మాట కోసం తాను ప్రకాష్ నగర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించానని, ఇందుకు సంబంధించి మంగళవారం నుంచే పనులు ప్రారంభిస్తానన్నారు. ప్రకాష్ నగర్‌లో 11 డ్రైనేజీ కాలువలతోపాటు అన్ని వీధుల్లో రోడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. స్థానికులు మాట్లాడుతూ విద్యుత్ లైన్, శ్మశాన వాటికకు రహదారి, డ్రైనేజీ కాలువలు, రోడ్లు ప్రధాన సమస్యలు అని తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఏ ఎమ్మెల్యే సొంత డబ్బుతో ప్రజలకు సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు. తమ కాలనీ అభివృద్ధిపై ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయంపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వివేకానంద కాలనీలో ఉన్న సచివాలయానికి వచ్చి సమస్యలను పరిశీలిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపీటీసీ తుపాకుల బాలాజీ నివాస్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ కంభం వెంకటేశు, వార్డు మెంబర్లు సోని, భవాని, మాజీ సర్పంచ్ గురుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ, గౌస్, మాజీ వార్డు మెంబర్ తుపాకుల అరుణకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, రాజుపాళెం మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యం పాల్గొన్నారు.

బండి పుల్లయ్యకు పరామర్శ

ఇటీవల గుండెకు ఆపరేషన్ చేయించుకుని ప్రకాష్ నగర్‌కు వచ్చిన పూసల సంఘం పట్టణాధ్యక్షుడు బండి పుల్లయ్యను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

ప్రొద్దుటూరు : రాయచోటిలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు, రాష్ట్ర నాయకుడు సుధాకర్ మాదిగ తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల గురించి, ఎస్సీ భూముల గురించి, దళితుల కష్టాలపై ఆయనకు వివరించినట్లు వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ ప్రయాణంలో గిఫ్ట్‌స్కీం అమలు

బద్వేలు అర్బన్ : బద్వేలు నుంచి కడపకు ఆర్టీసీ బస్సుల్లో తిరిగే ప్రయాణికులకు గిఫ్ట్‌స్కీం విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు డిపో నుంచి కడప రూట్‌లో అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరిన అనంతర వారి టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఉన్న గిఫ్టబాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా రెండవ, నాల్గవ శుక్రవారాల్లో డ్రా తీసి బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువైద్య కళాశాల విద్యార్థినికి బెస్ట్ అవార్డు



నర్మద రాఘవిని అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ వైకుంఠరావు

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో చదువుతున్న డి.నర్మద రాఘవికి బడ్డింగ్ వెటర్నేరియన్ అవార్డు లభించింది. ఈనెల 24, 25 తేదీల్లో చెన్నైలో తమిళనాడు వెటర్నరీ అండ్ అనిమల్ సైన్సెస్ యూనివర్సిటీ 13వ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 400 మంది పశువైద్య విద్యార్థులు హాజరయ్యారు. పశువులలో మెదడుకు సంబంధించిన జబ్బుల నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు ఈ విద్యార్థిని ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ పరిశోధన కళాశాల మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భవనం సుధాకర్ రెడ్డి, ప్యారాసైటాలజి విభాగాధిపతి డాక్టర్ సిరిగిరెడ్డి శివజ్యోతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ వైకుంఠరావు నర్మద రాఘవిని అభినందించారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్



పంపింగ్ లైన్‌కు మరమ్మతులు చేసేందుకు తీసిన గుంత

ప్రొద్దుటూరు : రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి బొల్లవరం రిజర్వాయర్ 1, 2, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో రిజర్వాయర్‌కు, సంజీవనగర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే లైన్ పగిలిపోవడంతో మంగళ, బుధవారాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. 450 ఎం.ఎం. డయా జీఆర్పీ పంపింగ్ లైన్ మార్కెట్ యార్డు వద్ద పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మేజర్స్ మెగా ఇంజినీరింగ్ వర్క్స్ వారు పైపులైన్ పనులు చేస్తుండగా పైపులైన్ పగిలిపోయిందన్నారు. పంపింగ్‌లైన్ పగిలిపోవడంతో ఎక్కువ నీరు వృథాగా పోతోందన్నారు. పగిలిపోయిన పైపులైన్ మరమ్మతులు చేసేందుకు నీటి సరఫరాను నిలిపివేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని బొల్లవరం, బుడ్డాయపల్లె, బాకరాపేట, వైఎస్సార్ నగర్, సూపర్ బజార్ రోడ్డు, శ్రీకాళహస్తయ్య వీధి, హనుమాన్‌నగర్, కుమ్మరకొట్టాలు, పఠాన్ కాలేజీ, ఎర్రన్నకొట్టాలు, డ్రైవర్ కొట్టాలు, సరస్వతి విద్యామందిరం రోడ్డు, కొర్రపాడు రోడ్డు, గోపిరైస్ మిల్లు రోడ్డు, గోకుల్ నగర్, శ్రీనివాసనగర్, స్వరాజ్యనగర్, సంజీవనగర్, కృష్ణా నగర్, ఆంధ్రకేసరి రోడ్డు తదితర ప్రాంతాల వారికి మంగళ, బుధవారాల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కోరారు.

ఎగ్జిబిషన్ వేలం నేటికి వాయిదా

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో దసరా ఎగ్జిబిషన్ 45 రోజులపాటు నిర్వహించేందుకు సోమవారం జరిగిన టెండర్ కం – బహిరంగ వేలానికి ఎవరూ ముందు రాకపోవడంతో వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ టెండర్ కం– బహిరంగ వేలం మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నుంచి పీజీ ఎంకాం లేదా బీకాం హానర్స్ కోర్సుకు కళాశాలకు అనుమతి వచ్చిందన్నారు. 2022–23 సంవత్సరంలో బీకాం పాస్ అయిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని వివరించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పీజీసెట్ అవసరం లేదని, విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన, స్కాలర్ షిప్‌లు ప్రభుత్వం నుంచి లభిస్తాయని తెలిపారు.

సేవ్ గర్ల్ చైల్డ్ సైకిల్ యాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కలవడానికి మంగళవారం నుంచి సైకిల్ యాత్ర చేపట్టినట్లు మహేష్ ఆర్ట్స్ నిర్వాహకుడు తుపాకుల రామాంజనేయులరెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టుపై అవగాహనలో భాగంగా హైదరాబాద్‌కు సైకిల్‌పై యాత్ర చేపట్టినట్టు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా రాష్ట్రపతి నుంచి సాధారణ ప్రజల వరకు వివిధ రంగాలకు చెందిన ఎంతో మంది ప్రముఖులకు చిత్రాలను బహూకరించి ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. ఆడ పిల్లలను బాగా చదివించాలని, వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించాలని కోరారు. నారాయణ, ఆర్‌వీ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు రాఖీ, శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



వేడుకలో బ్రహ్మకుమారీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోక్షగుండం వీధిలోని ఓంశాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో సోమవారం ముందస్తు రాఖీ, శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు నిర్వహించారు. పరమాత్ముని రక్షణలో సర్వమానవాళిని సహోదరత్వంతో చూసే ఆధ్యాత్మిక భావాలు నింపడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. చిన్నారులకు శ్రీకృష్ణుని అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక సబ్ జోనల్ ఇన్‌చార్జి బీకే లీలా బెహన్ జీ, జిల్లా అడిషనల్ సబ్ జోనల్ ఇన్‌చార్జి గీతా బెహన్‌జీ, డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణ, వీరారెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాయిహర్షిత, బీకే పావని, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి




దీర్ఘకాలిక రోగికి వైద్యం అందిస్తున్న వైద్యాధికారి కావ్య మాధురి

చాపాడు :ప్రతి నెలా 15 రోజులకు ఒక సారి గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.ఓబాయపల్లె పంచాయతీలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 104 వాహనంతో పాటు వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేడు కుచ్చుపాపలో వైద్య శిబిరం

మండల పరిధిలోని కుచ్చుపాప గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తామన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ కాలనీలో పోలీసుల తనిఖీలు



మాట్లాడుతున్న అర్బన్ సీఐ బీవీ చలపతి

మైదుకూరు : పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం అర్బన్ సీఐ బీవీ చలపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్ట వ్యతిరేకమైన పనులు చేసేవారు, నిషేధిత వస్తువులు విక్రయించేవారి గురించి కాలనీలో ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను ఉద్దేశించి సీఐ బీవీ చలపతి మాట్లాడుతూ కాలనీలో కొత్త వ్యక్తులకు ఇంటిని అద్దెకు ఇచ్చే సమయంలో వారి నుంచి ఆధార్ కార్డు ఇతర ధృవపత్రాలను తీసుకోవాలని సూచించారు. గంజాయి, మద్యం ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. లాటరీలో డబ్బులు తగిలాయని ఫోన్ చేసే వారి పట్ల, ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 13 బైకులు, 5 ఆటోలను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు ఘన మద్దిలేటి, సుబ్బారావు, చాపాడు ఎస్ఐ మైనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

దువ్వూరు : మండల వ్యాప్తంగా పంటలను సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, జిరాక్స్ పత్రాలతోపాటు సెల్‌ఫోన్ నంబర్ తీసుకెళ్లి ఈక్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులకు పంట నష్టపరిహారం, ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు.

పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య పెరిగేలా చూడాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వై.చంద్రహాసరెడ్డి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య పెంచేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మరాజుపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిల్లో, పీహెచ్‌సీలలో జరిగే కాన్పులకు ఆరోగ్య ఆసరా పథకం కింద ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందనే విషయాన్ని తెలియజేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదని, అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. దోమల నివారణ కోసం వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత, సీహెచ్‌ఓలు శిరీష, స్వాతి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, వైద్య సిబ్బంది ఓబులయ్య, కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు భాషా దినోత్సవం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని మొల్లమాంబ సమావేశ మందిరంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొంగలవీడు పంచాయతీలో గల ఉప్పత్తివారిపల్లె, నడింపల్లె, కొండాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న పోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ద పోలిరెడ్డి, సర్పంచ్ గాజులపల్లె నరసమ్మ, పంచాయతీ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నారాయణమ్మ, మండల నాయకులు రవీంద్రారెడ్డి, రమణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సునీల్ కుమార్

మైదుకూరు : జిల్లాలో సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర 4వ రోజు సోమవారం మైదుకూరుకు చేరుకున్న సందర్భంగా స్థానిక రాయల కూడలిలో వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లలో, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. గురుకుల పాఠశాలలు శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని చెప్పారు. ఎస్టీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో ఉండాల్సిన పరిస్థితి మైదుకూరులో ఉందన్నారు. అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ పేరుకు మాత్రమే ఉందని, దానిని రిపేర్ చేయించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు రాహుల్, సహాయ కార్యదర్శి వీరపోగు రవి, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంపల్లె అజయ్, నాయకులు మోహన్, రవి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా నరసింహులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక



రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన కమిటీ

రాజుపాళెం : రాజుపాళెంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు యు.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా దస్తగిరి సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బి.పుల్లయ్య (కుమ్మరపల్లె), కోశాధికారిగా బి.వెంకటరెడ్డి (టంగుటూరు), ఉపాధ్యక్షుడిగా యు.నాగరాజ్ (ఉప్పలపాడు), ఉపకార్యదర్శిగా ఎస్.వెంకటసుబ్బారెడ్డి (పర్లపాడు)లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌పీఓ సీసీ ఎ.మహమ్మద్‌గౌస్, అకౌంటెంట్ వై.సునీత, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం సమరభేరి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : సీపీఎం పార్టీ నాయకులు సోమవారం పోరుమామిళ్లలో సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోటి ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపారన్నారు. కార్యక్రమంలో గౌసియాబేగం, రవి, బీబీ, సుందరం, రత్నం, దుర్గయ్య, రంతున్నీసా, జేమ్స్ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తే బహుమతులు



మైదుకూరు : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆయా దూరాలను బట్టి నిర్ణయించిన మేరకు టికెట్‌కు డబ్బులు కట్టాలి.. కానీ మా డిపోకు చెందిన బస్సుల్లో ప్రయాణించే వారికి మేము బహుమతులు ఇస్తామంటున్నారు మైదుకూరు డిపో ఆర్టీసీ డిపో మేనేజర్. ఆ వివరాల్లోకి వెళ్తే.. మైదుకూరు డిపోకు చెందిన మైదుకూరు – పోరుమామిళ్ల, మైదుకూరు – గిద్దలూరు, మైదుకూరు – కడప సర్వీసుల్లో ప్రయాణించే వారికి గిఫ్ట్ స్కీంను ఏర్పాటు చేసినట్టు డీఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరు డిపోకు చెందిన పోరుమామిళ్ల, గిద్దలూరు, కడప రూట్లలో ప్రయాణించే వారికి లక్కీ డీప్ తీసి బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీలోపు తిరిగే ప్రయాణీకులకు 16వ తేదీన, సెప్టెంబర్ 16 నుంచి 30వ తేదీల మధ్యలో ప్రయాణించే వారికి అక్టోబర్ 1న లక్కీ డీప్ తీసి ఆకర్షణీయమైన బహుమతులను అందిస్తామన్నారు. ఆయా రూట్లలో ప్రయాణించే వారు బస్సు దిగే సమయంలో తమ టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్ రాసి అదే బస్సులో ఉన్న బాక్స్‌లో వేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.